

'కలంకారీ మోహన్'కు రాష్ట్రపతి అభినందన



మనవడు వేహంత్‌తో పాటు రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటున్న మోహన్

కలంకారీ కళాకారుడిగా విశేష గుర్తింపు పొందిన తలిశెట్టి మోహన్, ఆయన మనవడు వేహంత్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. శ్రీకాళహస్తిలోని కంఠావీధికి చెందిన మోహన్ కలంకారీ చిత్రాలు రూపొందించడంలో ప్రసిద్ధులు. 2023లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి కలంకారి విభాగంలో అవార్డు అందుకున్నారు. గత నెలలో ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో వివిధ హస్తకళలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా కలంకారిలో 50 మందికి మూడు రోజులు పాటు శిక్షణ ఇవ్వాలని మోహన్‌ను అధికారులు ఆహ్వానించారు. ఆయన మనవడు వేహంత్ అమెరికాలో తల్లిదండ్రుల వద్ద ఉంటూ వారసత్వంగా ఈ కళలో ప్రావీణ్యం పొందాడు. చిన్నతనం నుంచే కలంకారీ చిత్రాలు గీయడంలో పట్టు సాధించాడు. ఆరో తరగతి చదువుతున్న ఈ బాలుడు అమెరికా నుంచి ఇటీవల ఇండియాకు వచ్చి తాతతోపాటు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యాడు. ఈక్రమంలో శనివారం రాష్ట్రపతి భవన్‌లో అభినందన కార్యక్రమం జరిగింది. కలంకారీ శిక్షణ ఇచ్చిన మోహన్‌ను, బాల్యంలోనే ప్రతిభ చాటుతున్న వేహంత్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

సిబ్బంది లేకుంటే గస్తీ ఎలా?

ప్రతి ఆరు బోగీలకు ఇద్దరు జీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్ సిబ్బంది భద్రతా విధుల్లో ఉండాలి. కానీ, 24 బోగీలకు కలిపి కేవలం ఇద్దరే ఉంటున్నారు.

- రైల్వేలో గస్తీ సిబ్బంది కొరతకు ఇదే నిదర్శనం. ఇది రైళ్లలో చోరీలు, దోపిడీలపై ప్రభావం చూపుతోంది.



- రైల్వేలో పీడిస్తున్న కొరత
- తిరుపతి సబ్ డివిజన్‌లో 39 కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీ
- పెరుగుతున్న చోరీలు, దోపిడీలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల రైళ్లలో చోరీలు, దోపిడీలు పెరిగాయి. చిత్తూరు రూరల్ మండలం సిద్ధంపల్లి రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ నెల 26వ తేది తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో రైల్వే సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి ఎక్స్‌ప్రెస్ రైలులో దోపిడీ చేశారు. రెండు బోగీల్లోకి చొరబడిన దుండగులు నలుగురు ప్రయాణికుల నుంచి 70 గ్రాముల బంగారు నగలు కాజేశారు. మే 2న చంద్రగిరి మండలం ముంగిలిపట్టు రైల్వే స్టేషన్ పరిధిలో హోమ్ సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్‌కు గురైంది. రెడ్ లైటు వెలుగుతుండడంతో రైలు ఆగింది. ఇంతలోనే దుండగులు బోగీలోకి దూరి ఇద్దరు మహిళల మెడల్లో బంగారు గొలుసులు లాక్కెళ్లారు. తాజాగా శనివారం అర్ధరాత్రి విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు వద్ద దుండగులు చోరీకి యత్నించారు. ఇలా ఇటీవల రైళ్లల్లో చోరీలు, దోపిడీలు పెరుగుతున్నాయి. దాదాపు ఒకే తరహాలో దుండగులు దోపిడీకి పాల్పడుతున్నారు. గస్తీ సిబ్బంది తగు సంఖ్యలో లేకపోవడంతోనూ ఈ ఘటనలు పెరుగుతున్నాయని తెలుస్తోంది. ఎందుకంటే.. రైల్లో గస్తీ నిర్వహించే పోలీసులు.. బోగీల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే విచారించాలి. అదుపులోకి తీసుకోవాలి. కానీ రైలుకంతా కలిపి ఇద్దరే ఉంటున్నారు. దీంతో వీరు పూర్తిస్థాయిలో గస్తీపై దృష్టి పెట్టలేకున్నట్లు సమాచారం. గత 20 సంవత్సరాలుగా పదవీ విరమణతో ఖాళీ అవుతున్న స్థానాలు భర్తీ కావడం లేదని, సివిల్ పోలీసు నుంచి డిప్యుటేషన్‌పై రైల్వే శాఖకు రావడానికి చాలామంది అయిష్టత చూపుతున్నారని తెలుస్తోంది.

ప్రయాణికుల భద్రతకు పెద్దపీట

రైల్వే శాఖలో సిబ్బంది కొరత వాస్తవమే. అయితే తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ ఆధ్వర్యంలో ఉన్న సిబ్బందితో ప్రయాణికుల భద్రత ధ్యేయంగా గట్టిగా బందోబస్తు చేస్తున్నాం. ఇటీవల రైలు దోపిడీలు, చోరీలను సవాల్‌గా తీసుకుని మరింత పకడ్బందీగా పని చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి పూట అన్ని బోగీలు తనిఖీ చేసి నివేదికలు తెప్పించుకుంటున్నాం. అనుమానితుల వేలిముద్రలు సేకరించే పని ముమ్మరం చేస్తున్నాం.

- ఆశీర్వాదం, రైల్వే జీఆర్పీఎఫ్ సీఐ, తిరుపతి

తిరుపతి సబ్ డివిజన్‌లో..

ప్రధానంగా తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో ఏఎస్‌ఐలు ఒకరంటే ఒకరు కూడా లేరు. నలుగురు ఎస్‌ఐలకుగాను ఇద్దరే ఉన్నారు. ఇక 10 మంది హెడ్ కానిస్టేబుళ్లకు గాను సివిల్ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ముగ్గురే పనిచేస్తున్నారు. 49 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా, పనిచేసేది పది మందే. వీరికి కోర్టు డ్యూటీలు, సమన్లు ఇవ్వడం, శవ పంచనామాలు నిర్వహించడం వంటి ఇతరత్రా డ్యూటీలూ ఉన్నాయి. దీంతో రైళ్లలో విధులు నిర్వహించడానికి అవసరమైన సిబ్బంది లేకుండా పోయారు. దీంతో దుండగులు సిగ్నల్ వ్యవస్థలు ట్యాంపరింగ్ చేయడం, రైళ్లలో ప్రయాణికుల్లా ప్రయాణించి దోపిడీలకు పాల్పడుతున్నారు.



రిజర్వు ఫారెస్ట్‌లో చదును చేసిన భూమి

గుట్టనూ వదల్లేదు

- రిజర్వు ఫారెస్ట్‌ను రాత్రిళ్లు చదును చేస్తున్న ఆక్రమణదారు

ప్రభుత్వ, డీకేటీ భూముల అయిపోయినట్లున్నాయి. గుట్టలపై ఆక్రమణదారు కన్నుపడింది. ఇలా రిజర్వు ఫారెస్టులో ఎక్స్‌కవేటరుతో చదును చేసి ఆక్రమణకు మొదలు పెట్టారు చంద్రగిరి మండలం గంగుడుపల్లెకు చెందిన వ్యక్తి. ఆ గ్రామానికి సమీపం, ప్రధాన రహదారికి ఆనుకొని అనుప్పల్లి- చంద్రగిరి రహదారి పక్కనే రిజర్వు ఫారెస్ట్ ఉంది. ఆ అటవీ ప్రాంతాన్ని మూడు రోజులుగా రాత్రి వేళల్లో ఎక్స్‌వేటర్‌తో చదును చేస్తున్నారాయన. తమ పశువులు, గొర్రెలు, మేకలు మేపుకోవడానికి కనీసం రిజర్వు ఫారెస్ట్‌నూ వదలకుండా కబ్జా చేస్తున్నారంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై సంబంధిత అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఆ దారిలో భూముల విలువ విపరీతంగా ఉండటంతో కబ్జాదారుడు ఏకంగా రిజర్వు ఫారెస్ట్‌నే ఆక్రమించే పనిలో పడ్డారు. ఇప్పటికే సుమారు రెండు ఎకరాలు చదును చేఇనట్లు సమాచారం. రిజర్వు ఫారెస్ట్ నుంచి గ్రామస్తులు పొయ్యిలోకి ఎండు కట్టెలను తీసుకొస్తేనే పట్టుకునే అధికారులు.. ఇప్పుడు ఏకంగా భూమినే చదును చేస్తుంటే పట్టించుకోకపోవడం ఏంటని స్థానికులు నిలదీస్తున్నారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

నాటు తుపాకి స్వాధీనం

నాగలాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం కస్తూరినాయుడుకండ్రిగలో పోలీసులు నాటుతుపాకి స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ సునీల్ ప్రకారం.. ఆదివారం ఉదయం గ్రామంలో పోలీసులు నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో ఎస్.గోవిందయ్య వద్ద నాటుతుపాకిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులో తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేవీబీపురం మండలం అంజూరు నుంచి వలసవచ్చి స్థిరపడ్డాడు. ఇతడిపై 20 ఏళ్ల కిందట శ్రీకాళహస్తి అటవీ రేంజ్ పరిధిలో వన్యప్రాణి విభాగం కింద కేసు నమోదైంది.



పోలీసుల అదుపులో గోవిందయ్య



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఇన్‌చార్జి పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు

ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్

చిత్తూరు సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఆదివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఇన్‌చార్జి పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి ఈఈ రామ్మోహన్, మదనపల్లె ఈఈ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో కౌన్సెలింగ్ జరిగింది. ఉమ్మడి జిల్లాలో 664 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉండగా ఆదివారం 400 మందికి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. మిగిలినవారికి సోమవారం ఉంటుంది. కాగా, కౌన్సెలింగ్ ప్రారంభంలో ఉద్యోగులకు, అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఖాళీగా ఉన్న ప్రాంతాల వివరాలు ప్రదర్శించాలని ఉద్యోగులు కోరారు. ఖాళీగా ఉన్నా.. తాము కోరుకున్న చోటు కాకుండా దూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని ఆరోపిస్తూ కొంతసేపు ఆందోళన చేశారు. ఖాళీలను ప్రదర్శించడానికి పెద్ద డిజిటల్ స్ర్కీన్లు తమ వద్ద లేవని అధికారులు చెప్పడంతో ఉద్యోగులు అసంతృప్తిగానే కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు.

మహిళా పోలీసుల కౌన్సెలింగ్‌లో రగడ

చిత్తూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా పోలీసుల బదిలీ కౌన్సెలింగ్‌లో రగడ చోటు చేసుకుంది. ఆదివారం స్థానిక పీటీసీ కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తూ ఐదేళ్ల సర్వీసు పూర్తయిన సుమారు 1,200 మంది మహిళా పోలీసులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. ఎస్పీ మణికంఠ పర్యవేక్షణలో ఆన్‌లైన్ ద్వారా ఖాళీల వివరాలను చూపించి బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. తొలుత అంధులు, విడోలు, స్పౌజ్, దివ్యాంగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ కేటగిరీల్లోని వారికి బదిలీలు చేపట్టారు. ఇది సరికాదని, ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అరుపులు, కేకలు వేయడంతో ఎస్పీ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అన్ని జిల్లాల్లో ఆఫ్‌లైన్‌లో బదిలీలు చేపట్టారని, పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్ ప్రక్రియ చేస్తున్నామని చెప్పారు. ఆందోళనలు చేయాలనుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దాంతో అందరూ మిన్నకుండిపోయారు. ఆదివారం మిగిలిన వారికి సోమవారం కూడా బదిలీ కౌన్సెలింగ్ జరుగుతుందని పోలీసు అధికారులు తెలిపారు.

కళ్లు 'కాయలు'కా సేలా..!

- గుజ్జు పరిశ్రమల వద్ద మామిడి రైతుల నిరీక్షణ
- వేచి ఉండలేక రోడ్లపై పారబోస్తున్న వైనం

సత్యవేడు/కేవీబీపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దిగుబడులు బాగున్నా ధరల్లేక మామిడి రైతులు నష్టాల బాటపడుతున్నారు. ప్రధానంగా తోతాపురి రకం కొనేవారు లేక కుదేలవుతున్నారు. రవాణా ఖర్చులు కూడా లేక కాయలు తోటల్లోనే మాగి నేల రాలుతున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలో నారాయణవనం, కేవీబీపురం, బుచ్చినాయుడు కండ్రిగ, సత్యవేడులో జ్యూస్ ఫ్యాక్టరీలకు ఎగుమతి చేసేవారు. మార్కెట్‌లో డిమాండు లేకపోవడంతో ఫ్యాక్టరీలు కొనుగోలుకు విముఖత చూపిస్తున్నాయి. దీంతో కనీసం పెట్టుబడి ఖర్చులయినా వస్తాయా లేదా అని రైతులు ఆందోళనలో ఉన్నారు. నియోజకవర్గంలోని జ్యూస్ ఫ్యాక్టరీలకు పొరుగు జిల్లాల నుంచి కూడా మామిడి రైతులు తరలిరావడంతో ఫ్యాక్టరీల వద్ద కిలోమీటర్ల మేర తోతాపురితో వచ్చిన వాహనాలు బారులు తీరుతున్నాయి. అన్‌లోడింగ్‌కు రెండు, మూడు రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. కేవీబీపురంలో మూడు నాలుగు రోజులు కూడా నిరీక్షిస్తున్నారు. కొందరు నిరీక్షించ లేక రోడ్డుపైనే కాయలు పడేసి వెళ్లిపోతున్నారు.



కేవీబీపురంలో బారులు తీరిన మామిడి లోడు ట్రాకర్లు



నారాయణవనంలో..

నియోజకవర్గంలో మామిడి పరిస్థితి

నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 2500 హెక్టార్లలో మామిడి పండిస్తారు. ఏటా 8వేల మెట్రిక్ టన్నుల నుండి 12 వేల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి అవుతోంది. ఇందులో తోతాపురి సుమారుగా 4వేల నుంచి 5 వేల మెట్రిక్ టన్నులున్నాయి ప్రస్తుతం సత్యవేడులోని కాప్రికార్న్ జ్యూస్ ఫ్యాక్టరీలో నాణ్యమైన మామిడి మాత్రమే తీసుకుంటున్నారు. ఇక్కడ రైతుల నుంచి రోజుకు 100 నుంచి 120 టన్నుల వరకు కొనుగోలు చేస్తున్నారు. నారాయణవనం, బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీపురం జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద సమస్య భిన్నంగా ఉంది. దిగుమతి కోసం ఎక్కువ రోజులు ఎదురు చూడాల్సి వస్తోంది.



రోడ్డుపై పడేసిన మామిడికాయల్ని తింటున్న పశువులు

టీటీడీ సేవలు ఎలా ఉన్నాయ్!

- కొనసాగుతున్న భక్తుల అభిప్రాయ సేకరణ

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ భక్తులకు అందిస్తున్న వివిధ సేవలను మరింత మెరుగుపరిచేందుకు భక్తుల అభిప్రాయాలను సేకరించే ఫీడ్ బ్యాక్ సర్వేను కొనసాగిస్తోంది. ఐవీఆర్ఎస్, వాట్సాప్ ద్వారా ఈ-సర్వే, శ్రీవారిసేవకుల ద్వారా మాన్యువల్ సర్వేలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఐవీఆర్ఎస్ ఎలక్ట్రానిక్ సర్వే విధానం ద్వారా భక్తులు తిరుమలయాత్ర పూర్తి అనుభవం, అన్నప్రసాదం, కల్యాణకట్ట, శ్రీవారి ఆలయం, వసతి, క్యూలైన్ల నిర్వహణ, లగేజీ కౌంటర్లపై మొత్తం 16 ప్రశ్నలతో తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చు.

వాట్సాప్: తిరుమల, తిరుపతిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను భక్తులు తమ మొబైల్‌తో స్కాన్ చేస్తే '93993 99399' వాట్సాప్ నెంబరు ఓపెన్ అవుతుంది. ఇందులో టీటీడీ అభిప్రాయ సేకరణ పేజీ ద్వారా భక్తులు తమ పేరుతో, విభాగం (అన్నప్రసాదం, శుభ్రత, కల్యాణకట్ట, లడ్డూప్రసాదం, లగేజీ, దర్శన అనుభవం, క్యూలైన్, గదులు వంటివి) ఎంచుకుని తమ ఫీడ్‌బ్యాక్ ఇవ్వచ్చు.



శ్రీవారి సేవకుల ద్వారా

తిరుమల, తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో టీటీడీ భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై ప్రత్యక్షంగా శ్రీవారి సేవకులతో అభిప్రాయ సేకరణ జరుగుతోంది. టీటీడీ రూపొందించిన ప్రశ్నావళితో కూడిన అప్లికేషన్‌ను తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని భక్తుల అభిప్రాయలను సేకరిస్తారు. త్వరలోనే టీటీడీ మొబైల్ యాప్, టీటీడీ బుకింగ్ పోర్టల్ నుంచీ అభిప్రాయ సేకరణ ప్రారంభించనున్నారు. భక్తుల అభిప్రాయాలను క్రోడీకరించి సేవలను మరింత మెరుగుపరిచే దిశగా టీటీడీ ఈ విధానాన్ని చేపట్టింది.

నకిలీ స్టిక్కరేస్తే అంతే..!

తిరుపతి(నేరవిభాగం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు, జర్నలిస్టు, టీటీడీ ఉద్యోగులు కాకున్నా.. మీ వాహనాలకు ఆ స్టిక్కర్లేసుకుని తిరుగుతున్నారా? అయితే జాగ్రత్త.. ఇలాంటి వాహనాలపై పోలీసులు దృష్టి పెట్టారు. తొలి దశలో స్టిక్కర్లు తొలగించి, కౌన్సెలింగ్ ఇస్తారు. రెండోసారీ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు చెబుతున్నారు. కొందరైతే మద్యం తాగి రోడ్లపైకి రావడం, పోలీసుల తనిఖీల్లో ప్రెస్ అని చెప్పి వెళ్లిపోతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఎస్పీ హర్షవర్ధనరాజు స్పందించారు. నకిలీ స్టిక్కర్లు వేసుకుని తిరుగుతున్న వారిని గుర్తించి తొలగించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 41 ప్రెస్, 54 పోలీసు, 31 టీటీడీ స్టిక్కర్లను పోలీసులు తొలగించారు.



భక్తులూ.. ఆగి వెళ్లండి

తిరుమల కొండకు వచ్చే భక్తులూ ఒక మాట. తిరుపతిలో కాసేపు ఆగి వెళ్లండి.. అంటూ పోలీసులు సూచిస్తున్నారు. 'దూర ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో తిరుమలకు వచ్చే భక్తులు తిరుపతిలో రెండు గంటల పాటు విశ్రాంతి తీసుకోండి. దీనివల్ల కార్ల ఇంజన్ చల్లబడుతుంది. వాహనాలు నడుపుతున్న వ్యక్తులకూ నిద్రమత్తు ఉండదు. ఇలా చేయడం వల్ల ప్రమాదాలను నివారించొచ్చు' అని చెబుతున్నారు. తిరుమలకు వచ్చే కారు ఆదివారం జీఎన్సీ టోల్‌గేట్ వద్ద ఇంజన్‌లో నుంచి పొగలు రావడంతో మంటలు వ్యాపించాయి. ఈ నేపథ్యంలో భక్తులకు సూచనలు చేస్తూ పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. రాత్రి సమయంలో శ్రీవారి దర్శనమై తిరుగు ప్రయాణమైన వారూ తిరుపతిలో ఆగి విశ్రాంతి తీసుకుని వెళ్లాలని సూచించారు. తద్వారా నిద్రమత్తు వీడి.. కొంతవరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొంటున్నారు.



తిరుమలలో ఆదివారం కారు నుంచి వచ్చిన మంటలను ఆర్పుతున్న సిబ్బంది

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

అనుమానాస్పద స్థితిలో లిక్కర్ గోడౌన్ సెక్యూరిటీ గార్డు మృతి

రేణిగుంట, జూన్ 29, (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో లిక్కర్ గోడౌన్ సెక్యూరిటీ గార్డు కృష్ణారెడ్డి (65) మృతి చెందారు. గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం.. తిరుపతి- రేణిగుంట మార్గంలోని మద్యం గోడౌన్ వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వీరి సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. మృతుడు తిరుపతి నగరం లీలామహల్ వద్ద ఉంటున్న కృష్ణారెడ్డి (65)గా గుర్తించారు. తల వెనుక భాగంలో, ఒంటిపై గాయాలున్నాయి. షర్టు అక్కడక్కడ చినిగిపోయింది. క్లూస్ టీము ద్వారా వివరాలు సేకరిస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించనున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయాస్పత్రికి తరలించి.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

మామిడి రైతులను ఆదుకోవడంలో విఫలం

● రాష్ట్ర వ్యవసాయ సంఘం కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి విమర్శ


మామిడి చెట్లను తొలగించి సాగు చేసిన వరి పంటను పరిశీలిస్తున్న నేతలు

రామచంద్రాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర వ్యవసాయ సంఘం కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. రామచంద్రాపురం మండలం పీవీపురం పంచాయతీ రామిరెడ్డిపురంలో మామిడి చెట్లు నరికేసిన పొలాలను ఆదివారం రైతులతో కలిసి పరిశీలించారు. తోతాపురి రకానికి కిలో రూ.12 మద్దతు ధర అందేట్లు ప్రభుత్వం చూడాలన్నారు. గుజ్జు ఫ్యాక్టరీల యజమానులు, వ్యాపారులు సిండికేట్ అయి రైతుల నుంచి ర.రెండుకే కొంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చెప్పినట్లు రూ.8కి కొనని వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అందుకే మామిడి చెట్లు నరికేసి రైతులు వరి, వేరుశనగ సాగుకు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. రూ.12 మద్దతు ధరను ప్రభుత్వమే చెల్లించి మామిడికాయలను కొనుగోలు చేయాలన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు అందజేయాలన్నారు. గంగిరెడ్డిపల్లెలో రైతు జయరామిరెడ్డి మామిడి చెట్లను తొలగించి వరి, వేరుశనగ సాగుచేయడాన్ని పరిశీలించారు. మామిడితో నష్టపోయిన తీరును రైతు గిరీష్, రిత్విశు వారికి వివరించారు.

ధర్మాన్ని కాపాడండి

- కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి


ఉపన్యసిస్తున్న విజయేంద్ర సరస్వతి, హాజరైన పురోహితులు

రామచంద్రాపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధర్మాన్ని కాపాడాలని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి అన్నారు. మండలంలోని మిట్టకండ్రిగ ప్రాణయోగ ఆశ్రమంలో ఆదివారం పురోహితుల సంఘం ధర్మప్రచార సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయాల పరిరక్షణ - హిందూ ధర్మంపై ఉపన్యాసమిచ్చారు. అనంతరం చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాణయోగ ఆశ్రమ పీఠాధితి కైలాస్ గురూజీ, రామకృష్ణ శర్మ పాల్గొన్నారు.

పాకాల లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం


అనిల్, మహేష్ బాబు

పాకాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పాకాల లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు డిస్ట్రిక్ట్ 317ఇ జోన్ ఛైర్‌పర్సన్ మారసాని విజయబాబు తెలిపారు. అధ్యక్షుడిగా పోతుగుంట అనిల్, కార్యదర్శిగా మారసాని మహేష్ బాబు, ట్రెజరర్‌గా మారసాని నాగేంద్ర, ఉపాధ్యక్షుడిగా నెల్లూరు ధనుంజయలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2025 జూలై నుంచి జూన్ 2026 వరకు వీరి పదవీకాలం ఉంటుందని తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తామన్నారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడానికి ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.

పెన్షనర్లకు బకాయిలు వెంటనే చెల్లించాలి

పాకాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు బకాయిలను వెంటనే చెల్లించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు జి.ఆంజినేయులు కోరారు. ఎస్వీఎన్ పాఠశాలలో ఆదివారం బీటీఏ మండల శాఖ అధ్యక్షుడు జ్యోతి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020 మార్చి నుంచి డిసెంబరు 21 వరకు 22 నెలల పీఆర్సీ బకాయిలు చెల్లించాలన్నారు. 2024 జనవరి, జూలై, 2025 జనవరి డీఏ బకాయిలు మొత్తం 9.1శాతం పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. 2023 జూలై నుంచి 12వ పీఆర్సీ అమలుకావాల్సి ఉన్నా ఇంతవరకు కమిటీని కూడా నియమించకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన కూటమి పార్టీల నాయకులు అధికారంలోకి వచ్చి 13 నెలలు కావస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని, 12వ పీఆర్సీ కమిటీ నియమించి ఐఆర్ 30 శాతం ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కె.రామమూర్తి, నాయకులు కృష్ణమూర్తి, జయబాల, విజయమోహన్, రాజేంద్రుడు, ఆదికేశవులు, గోపాలయ్య, శివ, వెంకటయ్య, బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

తారకరామనగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్


ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రేణిగుంట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట, గాజులమండ్యం, ఏర్పేడు, సబ్ డివిజన్ పోలీసులు ఆదివారం ఉదయం అర్బన్ సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో తారకరామానగర్‌ని జల్లెడ పట్టారు. ఈ ప్రాంతంలో గంజాయి బ్యాచ్ ఆగడాలపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించడంతో పోలీసులు స్పందించి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని 18 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. వీటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాలుపడితే ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ సుధాకర్ రేణిగుంట, గాజులమండ్యం, ఏర్పేడు పోలీసులు పాల్గొన్నారు.

నంది వాహనంపై పరాశరేశ్వరుడు



నారాయణవనం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నంది వాహనంపై ఊరేగించారు. నిత్యకైంకర్యాలనంతరం వేద మంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివారితో సహా అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వారిని నంది వాహనంపై ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలతో దర్శించుకున్నారు.

చంద్రగిరి

శ్రీవారి దర్శన టూరిజం కోటాను ప్రారంభించాలని కోరా

● టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్

తిరుమల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గత తరహాలో శ్రీవారి దర్శనం కోసం వివిధ రాష్ట్రాలకు కేటాయించే టూరిజం కోటాను తిరిగి ప్రారంభించాలని టీటీడీని కోరామని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయ ముందు మీడియాతో మాట్లాడారు. టూరిజం కోటా ఇతర రాష్ట్రాల భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. గత డిసెంబరు నుంచి టీటీడీ ఈ కోటాను రద్దు చేసిందన్నారు. ఈక్రమంలో టీటీటీ అదనపు ఈవో వెంకయ్య చౌదరిని కలిసి తిరిగి ఈ దర్శనాలను ప్రారంభించాలని కోరినట్టు చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, ప్రభుత్వం ఈ పద్ధతిని తిరిగి మొదలుపెట్టే అంశంపై ఆలోచన చేయాలని విన్నవించుకుంటున్నానని అన్నారు. ఈ కోటాను మళ్లీ అందుబాటులోకి తీసుకొస్తే ఏపీ, తెలంగాణ ఆర్టీసీ కార్పొరేషన్లకు మేలు జరుగుతుందన్నారు.

అవిలాలలో నిబంధనలకు విరుద్ధంగా బోరుబావి డ్రిల్లింగ్

- గ్రామస్తులతో కలిసి అడ్డుకున్న సర్పంచ్ వెంకటరమణ


బోరుబావి డ్రిల్లింగ్‌ను అడ్డుకుంటున్న సర్పంచ్ వెంకటరమణ

తిరుపతి రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ పంచాయతీలోని హథీరాంజీమఠం భూమిలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన బోరుబావి డ్రిల్లింగ్‌ను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన బోరుబావిలకు సమీపంలో 100 మీటర్లలోపు కొత్తగా ప్రైవేట్ వ్యక్తి బోరుబావిని డ్రిల్లింగ్ చేస్తున్నారన్న సమాచారంతో సర్పంచ్ చెందిలి వెంకటరమణ స్పందించారు. గ్రామస్తులతో కలసి తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ ఏర్పాటు చేసిన బోర్లకు ఆనుకుని కొత్తబోరు బావిని తవ్వడం వల్ల పంచాయతీ బోర్లలో నీరుతగ్గిపోయి గ్రామానికి నీటి సమస్య ఏర్పడే అవకాశముందని, దీన్ని నిలుపుదల చేయాలని పోలీసులను కోరారు. బోరు ఏర్పాటుకు పంచాయతీ అనుమతి ఇవ్వలేదని, ఈ స్థలంపై న్యాయస్థానంలో కేసు నడుస్తోందని సర్పంచ్ వివరించారు. గ్రామస్తుల వినతిపై స్పందించిన పోలీసులు బోరుబావి తవ్వడాన్ని నిలుపుదల చేశారు.

అద్భుత కథకుడు, కవి సి.వేణు

● ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభలో ప్రముఖుల వాణి


సభలో ప్రసంగిస్తున్న మధురాంతకం నరేంద్ర

పలమనేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : అద్భుతమైన కవిత్వంతో పాటు కలకాలం నిలిచిపోయే కథలను సృజించిన సి.వేణు అని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు.పాలపిట్ట మాసపత్రిక ఆధ్వర్యంలో వెలువడ్డ సి.వేణు ప్రత్యేక సంచికను పలమనేరు లయన్స్ క్లబ్ ఆవరణలో ఆదివారం ఉదయం పలువురు సాహితీ ప్రముఖులు ఆవిష్కరించారు. సి.వేణు సాహిత్య వ్యక్తిత్వం గురించి స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని మధురాంతకం నరేంద్ర నిర్వహించి ప్రసంగించారు. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం మండికృష్ణాపురం గ్రామంలో జన్మించిన వేణు ఉత్తమ సమాజ నిర్మాణం కోసం ఉత్తేజకరమైన రచనలు చేశారని పచయిత మధురాంతకం నరేంద్ర పేర్కొన్నారు. నవ్విన ధాన్యరాశి కథల ద్వారా, మల్లెలు తూర్పుఎత్తినవేళ కవిత్వం ద్వారా అద్భుతమైన సాహిత్యాన్ని తెలుగులోకానికి అందించారన్నారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛత ప్రచురణల పక్షాన సి.వేణు కుమారుడు భానుమూర్తి రెడ్డి, చిత్తూరు జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, ఆకాశవాణి మాజీ అధికారి ఆకుల మల్లేశ్వరరావు,రచయిత్రి ఎంఆర్ అరుణకుమారి తదితరులు ఆయన రచనల గురించి మాట్లాడారు. పలమనేరు బాలాజి కథల సంపుటి ఏకలవ్య కాలనీ, కవితా సంపుటి లోపలేదో కదులుతున్నట్లు పుస్తకాల పరిచయ సభ ఆదివారం మధ్యాహ్నం జరిగింది. వీక్షణం పత్రిక సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ ఎరుకల జీవనగాథలను ఏకలవ్య కాలనీ పేరిట తొలిసారిగా వెలుగులోకి తీసుకొచ్చిన రచయిత పలమనేరు బాలాజి అని పేర్కొన్నారు.రచయితలు వి.ప్రతిమ,సుంకోజి దేవేంద్రాచారి తదితరులు బాలాజి రచనల గురించి ప్రసంగించారు.రచయితలు పల్లిపట్టు నాగరాజు, మంచికంటి, టీఎస్ఏ కృష్ణమూర్తి, కృష్ణస్వామిరాజు, కవితశ్రీ, ఎండపల్లి బారతి, పి.తులసినాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో నెమలి మృతి

చౌడేపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చిరుత పులి దాడిలో నెమలి మృతిచెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... చౌడేపల్లెకు చెందిన మహేష్‌కు పెద్దయల్లకుంట్ల వద్ద మామిడితోటలో ఆదివారం ఉదయం నెమలి మృతిచెంది ఉండటం రైతులు గుర్తించారు. అలాగే మృతి చెందిన ప్రదేశంలో చిరుతపులి కాలి గుర్తులు ఉండటం గుర్తించి అటవిశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. రెండు నెలల క్రితం యల్లకుంట్ల సమీపంలోని గుట్ట వద్ద చిరుత సంచరించినట్లు పశువుల కాపరులు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతపులి నుంచి ప్రమాదం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

జనసేనలో ప్రముఖ న్యాయవాది చేరిక

చంద్రగిరి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): చంద్రగిరికి చెందిన ప్రముఖ న్యాయవాది నరేంద్ర కుమార్ రెడ్డి జనసేన పార్టీలో చేరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు. నరేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్‌కల్యాణ్ సేవా దృక్పథం నచ్చి చేరినట్లు తెలిపారు. చంద్రగిరిలో పార్టీ విజయానికి దేవర మనోహర్ కృషి అభినందనీయమని కొనియాడారు. పార్టీ పటిష్ఠత కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. దేవర మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.



పుట్టగొడుగుల్లా ఆర్వో ప్లాంట్లు

● నిబంధనలకు పాతర

● కల్తీ నీటితో రోగాల బారిన పడుతున్న ప్రజలు

చంద్రగిరి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్వో ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. 60కు పైగా ప్రభుత్వ, ప్రైవేటు వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. రెండు రూపాయలకే స్వచ్ఛమైన 20 లీటర్ల తాగునీరు అందిస్తామని పంచాయతీ అనుమతితో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే ప్రైవేటు ప్లాంట్లు రూ.2 రూపాయలకు ఇవ్వడంలేదు. 20 లీటర్లకు రూ.5 చొప్పున వసూలు చేస్తున్నారు. మరికొందరు రూ.7 వసూలు చేస్తున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్లాంట్లు మాత్రం కొన్నిచోట్ల రూ.2 మాత్రమే వసూలు చేస్తున్నాయి. అయితే నిబంధనలకు పాతర వేసి స్వచ్ఛమైన నీరు ఇవ్వడం లేదన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. నిర్వహణ లోపంతో కొన్ని ప్లాంట్లలో కలుషిత నీరు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నీరు తాగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. తనిఖీలు చేయాల్సిన పంచాయతీ అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

ప్లాంటు ఏర్పాటు చేయడమే మా బాధ్యత



ప్రభుత్వ నిధులతో పంచాయతీ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసే వరకే మా బాధ్యత. నిర్వహణ సంబంధిత పంచాయతీ చూసుకోవాలి. పంచాయతీ వారు ప్రైవేటు ప్లాంట్లకు కూడా పన్నులు వేస్తున్నారు. నీరు స్వచ్ఛమైందా లేదా అనేది టోటల్ డిజాల్ సాల్ట్(టీడీఎస్) తనిఖీ చేయాలి. లేదా ల్యాబ్‌కు పంపించి తనిఖీ చేయాలి. తర్వాతే ప్రజలకు నీరు అందించాలి.

- రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, చంద్రగిరి

ప్రతినెలా తనిఖీ చేయాలి



ఆర్వో ప్లాంట్ల ద్వారా సరఫరా అవుతున్న నీటిని ప్రతి నెలా తనిఖీ చేయాలి. పంచాయతీ లేదా వైద్య సిబ్బంది టోటల్ డిజాల్ సాల్ట్(టీడీఎస్)తో నీటిని పరిశీలించాలి. ఆ రిపోర్టును ప్లాంటు ముందు నోటీస్ బోర్డులో ఏర్పాటు చేయాలి. పంచాయతీలో తీర్మానించిన ధరకే నీరు అందించాలి.

- సుబ్రమణ్యంయాదవ్, ఎ.రంగంపేట

ప్రతి ఒక్కరూ దైవచింతనను అలవరచుకోవాలి

● శక్తి పీఠాన్ని సందర్శించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు


రక్త పంచమి అలంకరణలో వారాహి దేవి - పీఠాధిపతుల ఆశీర్వాదం తీసుకుంటున్న బీఆర్ నాయుడు దంపతులు

రామచంద్రాపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవచింతనను అలవరచుకుని ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. మండలంలోని రాయలచెరువు కట్ట సమీపంలో వెలసిన శక్తిపీఠంలో నిర్వహిస్తున్న వారాహీ దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఆయన ఆదివారం పాల్గొన్నారు. శక్తిపీఠం కార్యనిర్వాహకులు శ్రీకాంత్, ప్రసాద్, సుధారాణి, అర్చకులు మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. రక్త పంచమి వారాహి, మరకత శక్తి కాళీదేవి, మరకత సిద్ధేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతిలను మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. టీటీడీ ప్రసాదాలను అందజేశారు. బీఆర్ నాయుడు మాట్లాడుతూ శక్తి పీఠాన్ని సందర్శించి, స్వామి, మాతాజీలను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. శక్తి పీఠంలో చాలా మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు.

రక్త పంచమి అలంకరణలో వారాహిదేవి

వారాహి దేవి నవరాత్రి బ్రహ్మోత్సవాలు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి, శక్తి పీఠాదీశ్వరి రమ్యానందభారతి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రక్త పంచమి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పంచామృతాభిషేకం నిర్వహించి, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, ఓం శక్తి నామస్మరణ నడుమ ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. వీఐపీలు, భక్తులతో శక్తిపీఠం కిటకిటలాడింది.

ఆకట్టుకున్న హిడింబాసుర, బకాసుర వధ


స్వామి, అమ్మవార్ల నగరోత్సవం


భిక్షాటనకు బయలుదేరిన భీముడి వేషధారులు

శ్రీకాళహస్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన హిడింబాసుర, బకాసుర వధ ఆకట్టుకున్నాయి. అంతకు మునుపు భీమసేనుడు పురవీధుల్లో భిక్షాటన చేశారు. ద్రౌపది, అర్జునుడు, శ్రీకృష్ణుడి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. సాయంత్రం భీమసేన ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ చప్పరంపై అధిష్టించారు.అనంతరం స్వామిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


బకాసురుడి వధ ఘట్టం

పంటలపై ఆగని గజదాడులు


కోటరాళ్ల వద్ద సంచరిస్తున్న ఏనుగులు - ఏనుగులు ధ్వంసం చేసిన బోరు మోటారు, ఫిల్టర్

కల్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజదాడులు ఆగడం లేదు. మూడేళ్లుగా మండలంలో తిష్ట వేసిన ఏనుగుల మంద విడతల వారీగా పంటలను ధ్వంసం చేయడంతో పంటలకు అపారనష్టం వాటిల్లుతోంది. 30 ఏళ్లనాటి మామిడిచెట్లను సైతం ఏనుగుల గుంపు కూకటివేళ్లతో పెకలిస్తుండటంతో మామిడి రైతాంగానికి తీరని నష్టం జరుగుతోంది. బాధిత రైతులకు అటవీశాఖ తూతూ మంత్రంగా నష్ట పరిహారం చెల్లించడంతో వ్యవసాయంపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు. శనివారం రాత్రి తూర్పు విభాగం అడవీ ప్రాంతం నుంచి బయలుదేరిన 17 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లి సమీపానికి చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు రవి, లక్ష్మీపతిరెడ్డి మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి దిగుమూర్తివారిపల్లి మీదుగా కుమ్మరిపల్లి వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు రైతు ధర్మేంద్రకు చెందిన బోరుమోటారును కదిలించాయి. డ్రిప్ పైపులు, ఫిల్టర్లను ధ్వంసం చేశాయి. మామిడిచెట్ల కొమ్మలు, రాతి కూసాలను విరిచేశాయి. అక్కడ నుంచి కోటపల్లి మీదుగా అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. ఏనుగులు వెళుతున్న మార్గంలో కోటపల్లిలోని రైతు దామోదర్‌నాయుడుకు చెందిన మామిడిచెట్లను విరిచేశాయి. సుమారు టన్ను మామిడికాయలను తిని నేలరాల్చాయి. అనంతరం అడవిలోకి చేరుకున్నాయి. ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటలను ఆదివారం ఉదయం అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. నష్ట పరిహారం అందించేందుకు సంబంధిత భూరికార్డులతో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆదివారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో మధు తెలిపారు.

బోయకొండలో భక్తుల రద్దీ


అలంకరణలో బోయకొండ గంగమ్మ

● అమ్మవారిని దర్శించుకున్న 30 వేలమంది భక్తులు

● సేవా టిక్కెట్లతో రూ.17 లక్షల ఆదాయం

చౌడేపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తుల నామ్మరణతో ఆలయం మార్మోగింది. వేకువజామునే ఆలయ అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అమ్మవారికి పంచామృతా భిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలు, పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. సుమారు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన అమ్మవారి భక్తులు ఎంజీకే గాయత్రి ఫ్లవర్ స్టాల్, జేఎంఎస్ అన్నపూర్ణేశ్వరీదేవి ఫ్లవర్ స్టాల్ యజమానులు కృష్ణ, శ్రీదేవి, గుణశేఖర్, లావణ్య 1500 కిలోల పూలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. వివిధ సేవా టిక్కెట్లతో ఒక్కరోజులో అమ్మవారికి రూ.17 లక్షల ఆదాయం చేకూరింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.


దర్శనం కోసం క్యూలైన్లలో వేచివున్న భక్తులు(పైన) కర్ణాటక భక్తులు కానుకగా ఇచ్చిన పూలతో అలంకరణ

సంకల్పంతో డ్రగ్స్ రహిత సమాజం



త్రీకే రన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 29(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ సంకల్పం పెట్టుకుంటేనే డ్రగ్స్ లేని సమాజం సాధ్యమవుతుందని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. ఆదివారం 92.7బిగ్ ఎఫ్ఎం, జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మత్తు వదలరా త్రీకే రన్ కార్యక్రమం నిర్వహించారు. పూర్ణకుంభం సర్కిల్ నుంచి తిమ్మినాయుడుపాళెం వరకు మూడు కిలోమీటర్లు నిర్వహించిన రన్‌లో పోలీసులు, బిగ్ ఎఫ్ఎం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ నివారణ కోసం ప్రత్యేకంగా ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమకు సంబంధం లేదని అనుకోకుండా ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌పై సమాచారం తెలిస్తే 1972 నంబరుకు చెప్పాలని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అనంతరం బిగ్ ఎఫ్ఎం ప్రతినిధులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, డీఎస్పీ భక్తవత్సలం, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, రిజర్వు సీఐ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో జూనియర్స్ సీపీఎల్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

తిరుపతి(క్రీడలు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): జూనియర్స్ సీపీఎల్ 1 త్వరలో నిర్వహించనున్నట్లు సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో జూనియర్స్ సీపీఎల్ 1 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే క్రీడా ప్రతిభను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో 12నుంచి 16సంవత్సరాల లోపు క్రీడాకారులతో జూనియర్స్ సీపీఎల్ 1 టీ 20లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టీంలను ఫ్రాంచైజీ ద్వారా దక్కించుకునేందుకు ఆసక్తిగల యజమానులు ముందుకురావాలని, మరిన్ని వివరాలకు 8886185559, 9000214966నంబర్లను సంప్రదించాలని కోరారు. నరసింహాచారి, నరేంద్ర, రవి, గిరిప్రకాష్, శ్రీనివాసమూర్తి, శ్రీధర్, సతీష్‌యాదవ్, హరిప్రసాద్, దివాకర్, రవి, మార్కండేయులు, సత్యశ్రీనివాస్, వేణుగోపాల్‌నాయుడు, శివప్రసాద్, రమణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ ఏటీఎంకు సన్మానం



డి.ఆర్.నాయుడిని సత్కరిస్తున్న అధికారులు, ఉద్యోగులు

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సెంట్రల్ బస్టాండు ఏటీఎం డి.రామచంద్రనాయుడు సోమవారం ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ఆదివారం ఆర్టీసీ ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు సత్కరించారు. లీలామహల్ సెంటర్‌కు సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి, డీపీటీవో జగదీష్ ముఖ్య అతిథులుగా హాజరై ఆర్టీసీలో ఆయన సేవలను కొనియాడారు. ఆర్టీసీ అధికారులు విశ్వనాథం, బాలాజీ, హరిబాబు, సహజాద్, అర్జునయ్య, ఈ.ఆర్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభచాటిన విద్యార్థులకు ప్రోత్సాహం



విద్యార్థినులకు బ్యాగు, జ్ఞాపికలు అందజేస్తున్న ప్రాఫిట్ షూ కంపెనీ యాజమాన్యం

తిరుపతి(విద్య), జూన్ 29(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు ప్రోత్సాహం లభించింది. లీలామహల్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎం.హరిణి(567మార్కులు), జి.వరలక్ష్మి(566మార్కులు) సాధించి, తిరుపతి అర్బన్ మండలంలో మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. గాంధీ రోడ్డులోని ప్రాఫిట్ షూ కంపెనీ ఎండీ కోటీశ్వరరావు ఆదేశాల మేరకు స్టోర్ మేనేజర్ సుబ్రహ్మణ్యం వారికి ట్రాఫిక్ సీఐ సంజీవ్, కార్పొరేటర్ నరసింహచారి చేతులమీదుగా స్కూల్‌బ్యాగ్స్, జ్ఞాపికలు, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ న్యూ మంగళం కార్యవర్గం



గోపాల్‌యాదవ్ (ఫైల్ ఫొటో)

తిరుపతి అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం న్యూమంగళం నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. అధ్యక్షుడిగా వేమూరు గోపాల్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మునెయ్య, ఉపాధ్యక్షుడిగా గంగాధరం, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఆనందరెడ్డి, కార్యదర్శిగా పి.మురగారెడ్డి, కోశాధికారిగా టి.మునికృష్ణ, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎద్దల సుబ్రహ్మణ్యం, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మునేంద్ర, తెలుగు మహిళ అధ్యక్షురాలిగా రెడ్డెమ్మ, తెలుగు యువత అధ్యక్షుడిగా హేమాద్రిలను ఎన్నుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.2.90 కోట్లు
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 90,051
తలనీలాలు సమర్పించినవారు: 39,058

పద్మావతి అమ్మవారికి కానుకగా వెండి తుంగా వళికలు



తుంగావళికలు అందిస్తున్న దాత వీరాంజనేయులు

తిరుచానూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి రూ.3.30 లక్షల విలువైన వెండి తుంగా వళికల(వేలాడే దీపస్తంభాలు)ను హైదరాబాద్‌కు చెందిన వీరాంజనేయులు ఆదివారం అందజేశారు. 3కేజీల బరువు ఉన్న వెండి తుంగావళికలను దాత కుటుంబ సభ్యులతో కలసి అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతికి అందజేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విశాఖపట్నానికి చెందిన ఉషారాణి, మయూరి నృత్య నికేతన్ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన నాట్యం సభికులను అలరించింది. గజాననయుతంతో మొదలై బ్రహ్మాంజలి..అదివో అల్లదివో శ్రీహరివాసము, గజవదన బెడువే.. శ్రీమన్ నారాయణ..గరుడగమనరారా తదితర పాటలకు కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు. ఏర్పాట్లను ఏవో సుధాకర్ పర్యవేక్షించారు. కళాకారులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. నృత్య శిక్షకురాలు ఉషారాణి, ఏఈ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వ సంస్కృత సమ్మేళనంలో సంస్కృత వర్సిటీ వీసీ



నేపాల్‌లో మాట్లాడుతున్న సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో నిర్వహించిన 19వ విశ్వ సంస్కృత సమ్మేళనానికి తిరుపతిలోని సంస్కృత యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి హాజరయ్యారు. సమాజానికి సంస్కృత భాష అవసరం, ఔన్నత్యాన్ని వివరించారు. సంస్కృత భాషా, సాహిత్య వైభవాన్ని రాబోయే తరాలకు అందించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా వీసీ కృష్ణమూర్తి పేర్కొన్నారు. విశ్వ బంధుత్వ భావన పెరిగితే ప్రతిదేశం సస్యశ్యామలం అవుతుందన్నారు. సమ్మేళనం నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు.

క్రికెట్‌లోనూ రాణిస్తున్న మహిళలు



ఉమెన్స్ క్రికెట్ టీంను సన్మానిస్తున్న విజయ్‌కుమార్

తిరుపతి(క్రీడలు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): పురుషులతో సమానంగా క్రికెట్‌లో మహిళలు కూడా రాణిస్తున్నారని, వారిని మరింత ప్రోత్సహిస్తే ఉన్నతస్థాయి ఆటతీరును ప్రదర్శిస్తారని సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. ఈనెల 9నుంచి 15వ తేదీ వరకు నెల్లూరులో జరిగిన ఏసీఏ సౌత్‌జోన్ అండర్ 15 ఉమెన్స్ వన్డే ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నీలో చిత్తూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం ఆ టీమ్‌ను విజయ్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఏసీఏ స్థాయిలో చాంపియన్‌గా నిలిచినందుకు అభినందించారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఉమెన్ క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్, కోచ్ అనిత, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బంజారాల ఆరాధ్యదైవం హథీరాం బావాజీ

● జయంతి ఉత్సవాల్లో జితేంద్ర మహారాజ్



జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న జితేంద్ర మహరాజ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం హథీరాం బావాజీ అని మహారాష్ట్రకు చెందిన పౌరాదేవి వంశస్థులు జితేంద్ర మహారాజ్ పేర్కొన్నారు. టీటీడీ హథీరాంజీ మఠంలో ఆదివారం నిర్వహించిన హథీరామ్ బావాజీ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. హథీరాం బావాజీ జయంతి బంజారాలకు పండుగ రోజని అన్నారు. హథీరాం బావాజీ మార్గంలో ప్రతి బంజారా నడవాలని కోరారు. సేవ ద్వారానే మనిషికి జీవితంలో నిజమైన సార్థకత లభిస్తుందని చెప్పారు. తోటి మనుషులకు సేవ చేయడమే హథీరాం బావాజీకి అందించే నిజమైన నివాళి అని అభిప్రాయపడ్డారు. హథీరాం బావాజీ మాలధారణ ప్రతి బంజారా కుటుంబంలో వచ్చే శ్రావణమాసంలో వేయాలని సూచించారు. టీటీడీ పాలకమండలిలో బంజారాల ప్రాతినిథ్యం పెరగాలని కోరారు. కార్యక్రమ సమన్వయకర్త శివ నాయక్ మాట్లాడుతూ తిరుమలలో సోమవారం మహాభోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. హథీరాం బావాజీ సమాధి నుంచి బంజారా సాధుసంతులతో ప్రదర్శన చేపడతామన్నారు. హథీరాం బావాజీ భక్తులు పాల్గొనాలని కోరారు. కాగా, హథీరాం బావాజీ జయంతి ఉత్సవాల్లో అనేక రాష్ట్రాలకు చెందిన వందలాది మంది బంజారా సాధుసంతులు మాలధారణతో హాజరయ్యారు. కర్ణాటకకు చెందిన సర్దార్‌సింగ్ మహారాజ్, మంజు మహారాజ్, రమేష్‌గిరి, నేషనల్ కమిటీ సభ్యులు రవిరాథోడ్, రాజు రాథోడ్, అఖిల్‌రాథోడ్, ఏపీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, స్థానిక ప్రతినిధులు హరిబాబు, కిషోర్, మంజుకుమార్ పాల్గొన్నారు.

మంగళంలో ఆగని కబ్జాల పర్వం

ఆక్రమణలు తొలగించిన రెవెన్యూ అధికారులు



ఆక్రమణదారులు నిర్మించిన గోడ - గోడను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. తాజాగా తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని చెన్నాయిగుంట గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబర్ 195/1లో ప్రభుత్వస్థలం ఆక్రమణకు గురైంది. రెండు రోజుల క్రితం ఇదే ప్రాంతంలో కబ్జాకు పాల్పడుతున్న ఆక్రమణదారులను అడ్డుకుని రెవెన్యూ అధికారులు హెచ్చరించి పంపివేశారు. అయినా శనివారం అర్ధరాత్రి వేళ రహస్యంగా ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి, అప్పటికప్పుడే సిమెంట్ ఇటుకలతో గోడ కట్టేశారు. ఈ విషయం రెవెన్యూ అధికారుల చెవినపడింది. వీఆర్వోలు ప్రసాద్, సతీష్ వెంటనే అక్కడికి చేరుకుని రెండు రోజుల క్రితం, తాజాగా నిర్మించిన గోడలను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోనే ఇలాంటి ఆక్రమణలు జరుగుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి హద్దులను గుర్తించి, ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

అంతర్రాష్ట్ర
దోపిడీ దొంగ అరెస్టు

● 11.3 గ్రాముల నగలు, మోటార్ సైకిల్ స్వాధీనం



తిరుపతిలో అంతర్ రాష్ట్ర దొంగను అరెస్టు చేసిన క్రైం పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 29(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అంతర్రాష్ట్ర దోపిడీ దొంగను క్రైం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అతడి నుంచి 11.3 గ్రాముల బంగారు నగలు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్ వర్లకొండ గ్రామానికి చెందిన కృష్ణప్ప రాజేష్ చిన్నప్పటి నుంచి చెడు అలవాట్లకు బానిసయ్యాడు. సులభంగా డబ్బు సంపాదించడానికి దొంగతనాలు మొదలు పెట్టాడు. తమిళనాడు, కర్ణాటకతో పాటు చిత్తూరు, పీలేరు, చంద్రగిరి, తిరుమల-2 టౌన్, అలిపిరి, అన్నమయ్య జిల్లా మదనపల్లె, మదనపల్లె రూరల్, పుంగనూరు, ముదివేడు, కడప జిల్లా కోడూరు, రాయచోటి తదితర ప్రాంతాల్లో ఇంటి దొంగతనాలు, తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో జూన్ 9న కాటన్ మిల్లు వద్దనున్న ఎస్‌బీఐ కాలనీలో ఫరూక్ కుటుంబంతో కలసి కసుమూరు దర్గాకు వెళ్లారు. మోటార్ సైకిల్‌ను ఇంటి లోపల వరండాలో పెట్టి ఇంటికి తాళం వేసుకుని వెళ్ళారు. మరుసటి రోజు ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగుల కొట్టి ఉన్నాయి. బీరువాలోని నగలు, డబ్బు అపహరించుకుని వెళ్ళారు. ఇంట్లోని బంగారు నగలు, డబ్బు అపహరణపై తిరుపతి క్రైం పోలీసులకు ఫరూక్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

20 రోజుల వ్యవధిలో..

క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు ఆధ్వర్యంలో డీఎస్పీ శ్యాంసుందర్, సీఐలు చిన్నపెద్దయ్య, ఎస్.శివకుమార్ రెడ్డి, జయప్రకాష్, ఎస్ఐ సుభాష్ నాయక్, సిబ్బంది బృందాలుగా ఏర్పడ్డారు. పాత నేరస్థుల కదలికలపై ఆరా తీసి నిఘా ఉంచారు. ఈ క్రమంలో ఎస్వీవో కాలనీ వద్ద హరే రామ హరే కృష్ణ రోడ్డులో అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఎస్‌బీఐ కాలనీలో చోరీకి పాల్పడినట్లు అంగీకరించడంతో అతన్ని అరెస్టు చేశారు. అతడి నుంచి దాదాపు రూ.1.50 లక్షల విలువైన 11.3 గ్రాముల బంగారు నగలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 20 రోజుల వ్యవధిలో ఇంటి దొంగతనాన్ని చేధించడంలో ప్రతిభ కనపరచిన సీసీఎస్ సీఐలు చిన్నపెద్దయ్య, శివకుమార్ రెడ్డి, ప్రకాష్ కుమార్, ఎస్ఐ సుభాన్‌నాయక్, హెడ్ కానిస్టేబుళ్ళు మునిరాజ, విశ్వనాథ్, కానిస్టేబుళ్ల మోహన్, హరిప్రసాద్‌ను ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందించారు.

దేశం గర్వించే గణాంక శాస్త్రవేత్త పీసీ మెహలనోబీస్

● పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ



పీసీ మెహలనోబీస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దేశం గర్వించేంతటి గణాంక శాస్త్రవేత్త పీసీ మెహలనోబీస్ అని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ పేర్కొన్నారు. ఆ వర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగం - డేటాసైన్స్ సెంటర్ - ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐఎస్‌పీఎస్) సంయుక్తంగా పీసీ మెహలనోబీస్ జయంతి సభను పద్మావతి వర్సిటీలో ఆదివారం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ గణాంకశాస్త్రం సమాజంలో అత్యంత ప్రాముఖ్యత కల్గిందన్నారు. ప్రతి విషయంలో గణాంకాలను జోడించడం అనే అంశం సూటిగా బోధపడుతుందన్నారు. స్టాటిస్టిక్స్ చదువుకున్న వారికి మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కూడా పెంపొందించుకోవాలన్నారు. పీసీ మెహలనోబీస్ దేశాభివృద్ధికి గణాంక శాస్త్రవేత్తగా ఎంతో కృషి చేశారని అన్నారు. గణాంక శాస్త్రవేత్త ఇక్కుర్తి వెంకట్, అన్నామలై వర్సిటీ ప్రొఫెసర్ పార్థసారథి, డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అకడమిక్ కన్సల్టెంట్లకు పర్ఫార్మెన్స్ రివ్యూ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో అకడమిక్ కన్సల్టెంట్లు, అకడమిక్ కో-ఆర్డినేటర్లకు మంగళవారం నుంచి పర్ఫార్మెన్స్ రివ్యూ నిర్వహించనున్నారు. జూలై 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ చేపట్టేందుకు యూనివర్సిటీ అధికార యంత్రాంగం ప్రణాళికను రూపొందించింది. అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లోని వీసీ ఛాంబర్‌లో ఏర్పాట్లు చేశారు. 1వ తేదీ ఆంత్రోపాలజీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్‌సైన్స్, జియాలజీ, హోమ్‌సైన్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులకు సంబంధించిన వారికి రివ్యూ చేపడతారు. 2న ఫిషరీసైన్స్, జువాలజీ, కామర్స్, కంప్యూటర్‌సైన్స్, ఫార్మసీ సబ్జెక్టులకు నిర్వహిస్తారు. 3న సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్, 4న అడల్ట్ ఎడ్యుకేషన్, ఆర్కియాలజీ, హిస్టరీ, టూరిజం, ఉర్దూ, ఉమెన్ స్టడీస్, పాపులేషన్ స్టడీస్, ఎకనమెట్రిక్స్ ఎకనమిక్స్ ఇంగ్లిషు, హిందీ, హ్యూమన్‌రైట్స్, సోషియాలజీ వారికి రివ్యూ చేపడతారు. 5న లా, లైబ్రరీసైన్స్, ఫిలాసఫీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, పొలిటికల్‌సైన్స్, లింగ్విస్టిక్స్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, సంస్కృతం, హిందీ, తమిళం, ఎడ్యుకేషన్, ఏఐఎస్ఈ వారికి రివ్యూ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి యూనివర్సిటీలోని కాలేజీలకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

సార్వత్రిక సమ్మెకు సిద్ధంకండి



సమావేశంలో మాట్లాడుతున్న కవిత

తిరుపతి(ఆటోనగర్), జూన్29(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.కవిత కోరారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్పొరేటర్లకు ఊడిగం చేస్తున్న పాలకులకు బుద్ధి వచ్చేలా నిర్వహిస్తున్న ఈ సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొనాలని కోరారు. ఈ శిక్షణా తరగతుల్లో నాయకులు ఆర్.లక్ష్మి, ఎస్.జయచంద్ర, మాధవ్, కేఎన్ఎన్ ప్రసాదరావు మాట్లాడారు. నాయకులు లక్ష్మి, ఉష, జానకి, అను పాల్గొన్నారు.

హామీల అమలులో
ప్రభుత్వం విఫలం

● ఎస్‌యూసీఐ రాష్ట్ర నాయకురాలు ప్రమీల



సమావేశంలో మాట్లాడుతున్న ప్రమీల

తిరుపతి(ఆటోనగర్), జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా(ఎస్‌యూసీఐ) రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రమీల విమర్శించారు. స్థానిక యూత్ హాస్టల్‌లో ఆదివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీల అమలు గురించి పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సూపర్ సిక్స్‌లో కొన్నింటిని తూతూమంత్రంగా అమలు చేసి డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధిని ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరలు తగ్గించాలని, పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. పాఠశాలలను విలీనం చేయడం బాధాకరమన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైందన్నారు. రాఘవశర్మ మాట్లాడుతూ విద్యను వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ నగర ఇన్‌చార్జ్ హరీష్ మాట్లాడుతూ నగరంలో డ్రగ్స్, మద్యం విచ్చలవిడిగా సరఫరా అవుతున్నాయని, యువత వాటికి బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సదస్సులో ఎల్ఎన్ లక్ష్మి, వెంకటసుబ్బమ్మ, ఎన్.నవీన్‌కుమార్, మొబీన, అమీనా, ప్రతాప్ ప్రసంగించారు.

కాలువ తవ్వకంపై అభ్యంతరం



కాలువ తవ్వకాన్ని అడ్డుకున్న పిట్టివానిపల్లి గ్రామస్తులు

చిట్టమూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రొయ్యల చెరువులోని కలుషిత నీటిని గ్రామం వైపు మళ్లించేందుకు తవ్విన కాలువను ఆదివారం పిట్టివానిపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. మల్లాం గ్రామానికి చెందిన ఓ రొయ్యల చెరువు యజమాని సుమారు 50 ఎకరాల్లో రొయ్యల పెంపకం చేపట్టారు. ఆ చెరువుల్లోని కలుషిత నీటిని గ్రామం వైపు మళ్లించేందుకు ఆదివారం కాలువ తవ్విస్తుండడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. రొయ్యల హార్వెస్టు సమయంలో వచ్చే కెమికల్స్‌తో కూడిన కలుషిత నీరు పక్కనే ఉన్న రొయ్యల కాలువలోకి వెళ్లేదని, ఆ కలుషిత నీటిని గ్రామం వైపు వదిలి పెట్టేందుకు కాలువ తవ్వించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక గ్రామానికి దగ్గర్లో ఉన్న పంట కాలువను కూడా పూడ్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటి వల్ల వ్యాధులు ప్రబలడమే కాకుండా పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామని సర్పంచ్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

మహిళా సంరక్షణ కార్యదర్శులకు బదిలీలు

నేడు పోలీసు కార్యాలయంలో ప్రక్రియ

నెల్లూరు(క్రైం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు బదిలీల ప్రక్రియ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరగనున్నది. జిల్లా వ్యాప్తంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు 700 మంది వరకు ఉన్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసినవారు, ప్రత్యేక కేటగిరి, రిక్వెస్టు బదిలీలు కోరుకునేవారితో కలిపి మొత్తం సుమారు 500 మందికి స్థాన చలనం కలగనున్నది. పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 8 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు పీహెచ్ సర్టిఫికెట్, వీహెచ్ సర్టిఫికెట్, స్పౌజ్, నో డ్యూస్, మెడికల్ సర్టిఫికెట్లను ఒక సెట్ జిరాక్స్‌తో పాటు ఒరిజనల్స్‌ను తీసుకురావాలని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

ఉపాధి పనుల్లో అవినీతిపై విచారణ చేపట్టాలి

కోట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టాలని వైసీపీ నాయకుడు పాదర్తి రాధాకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని విద్యానగర్‌లో ఆదివారం ఆయనతో పాటు కోట మండల వైసీపీ అధ్యక్షుడు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం మంజూరు చేసిన రూ.1150 కోట్లు పంచాయతీలకు కేటాయించాలన్నారు. అలాగే పంచాయతీరాజ్ చట్టం 11 జీవో నెంబరును వెంటనే రద్దు చేసి కార్యదర్శులను విధుల్లోకి తీసుకొని పనిభారం తగ్గించి వేతనాలు పెంచాలన్నారు. ఈ డిమాండ్లపై సోమవారం తిరుపతి, నెల్లూరు జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు వారు చెప్పారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రెండో పట్టణ సీఐ శ్రీనివాస్

గూడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతామన్నారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడకుండా శాంతియుత జీవనం సాగించేలా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కూలీ సదస్సును విజయవంతం చేయండి

గూడూరుఅర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం నిర్వహించనున్న అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య పిలుపునిచ్చారు. ఆదివారం రైతుకూలీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనింగ్ మాఫీయా ఆక్రమణలో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో రమేష్, మమత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం



ఎన్‌సీసీ క్యాడెటతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గోడంగవే

కోట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పది రోజులపాటు జరిగిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గోడంగవే, ఎన్‌సీసీ క్యాడెట్లు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. శిక్షణ కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన వారికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

సంకల్పంతోనే డ్రగ్స్ రహిత సమాజం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 29(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ సంకల్పం పెట్టుకుంటేనే డ్రగ్స్ లేని సమాజం సాధ్యమవుతుందని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. ఆదివారం 92.7బిగ్ ఎఫ్‌ఎం, జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మత్తు వదలరా త్రీకే రన్ కార్యక్రమం నిర్వహించారు. పూర్ణకుంభం సర్కిల్ నుంచి తిమ్మినాయుడుపాళెం వరకు మూడు కిలోమీటర్లు నిర్వహించిన రన్‌లో పోలీసులు, బిగ్ ఎఫ్‌ఎం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ నివారణ కోసం ప్రత్యేకంగా ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమకు సంబంధం లేదని అనుకోకుండా ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌పై సమాచారం తెలిస్తే 1972 నంబరుకు చెప్పాలని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అనంతరం బిగ్ ఎఫ్‌ఎం ప్రతినిధులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, డీఎస్పీ భక్తవత్సలం, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, రిజర్వు సీఐ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



త్రీకే రన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రైల్లో నుంచి జారిపడి యువకుడి మృతి



దొరవారిసత్రం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం చెన్నై వెళ్లే కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో నుంచి జారి పడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. మృతుడికి 30-35 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, బ్లూ షర్టు, సిమెంట్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఇంతకు మించి ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్ఐ చెన్నైకేశవ తెలిపారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు జీఆర్‌పీ పోలీసులకు తెలపాలని కోరారు.

నేత్రదానం



రాధమ్మ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 470కి చేరింది. ఆదివారం కచ్చేరివీధికి చెందిన మద్దూరు రాధమ్మ(72) మరణాంతరం ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను దానం చేశారు. చెన్నై శంకర నేత్రాలయకు కార్నియాలను దానం చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



గుర్రపుడెక్కతో నిండిపోయిన దూడలకాలువ - చెట్లతో కమ్ముకుపోయి రూపుకోల్పోయిన నాయుడుకాలువ

వరదొస్తే... ముంపు తప్పదా!

గుర్రపుడెక్క, కలుపు మొక్కలు, చెట్లతో చిట్టడవుల్లా కాలువలు ● దుస్థితికి చేరుకుని రూపుకోల్పోయిన వైనం

గూడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వరదనీరు పట్టణాన్ని చుట్టుముట్టకుండా కండలేరు క్రీక్‌లో కలిపే కాలువలు దుస్థితికి చేరుకుని రూపుకోల్పోయాయి. ప్రధాన కాలువలు గుర్రపుడెక్క, కలుపు మొక్కలు, చెట్లతో నిండిపోయి చిట్టడవిని తలపిస్తున్నాయి. అధ్వానంగా ఉన్న కాలువల్లో వర్షపునీటి పారుదలకు ఇవి అడ్డంకిగా మారి ఎక్కడ పట్టణాన్ని వరదనీటితో ముంచెత్తుతాయోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో, తుఫానుల కారణంగా వరదనీరు పట్టణాన్ని చుట్టుముట్టకుండా ఉండేలా చల్లకాలువ, దూడలకాలువ, పంబలేరుకాలువ, నాయుడు కాలువలు కాపాడుతున్నాయి. వర్షాలు అధికంగా కురిసిన సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి, పలు చెరువుల నుంచి వచ్చే నీరు చల్లకాలువ, దూడల కాలువ, పంబలేరుకాలువ నుంచి పురిటిపాళెం సమీపంలోని జాతీయ రహదారి వద్ద ప్రవహిస్తున్న పంబలేరువాగులో కలిసి కండలేరు క్రీక్ ద్వారా సముద్రంలో కలిసిపోతాయి. రాపూరు, పైప్రాంతంలో నుంచి వర్షపునీరు మండలంలోని విందూరు గ్రామంలో గల పంబలేరు కాలువ ద్వారా పంబలేరు వాగులోకి, వెంకటగిరి, చెన్నూరు, పైప్రాంతాల ద్వారా వరదనీరు మర్రిపల్లిమడుగు నుంచి చల్లకాలువ ద్వారా, గూడూరుచెరువు నిండిపోతే కలుజులనుంచి దూడల కాలువ ద్వారా వరదనీరు పట్టణాన్ని ముంచెత్తకుండా పంబలేరువాగులో కలిసిపోతాయి. రావిచెరువు నుంచి వచ్చే వర్షపునీరు నాయుడుకాలువ ద్వారా గూడూరు చెరువుకు చేరుకుంటుంది. అయితే ఈ కాలువలు గుర్రపుడెక్క, చెట్లతో నిండిపోయి నీటి ప్రవాహాన్ని అడ్డుకునేలా మారాయి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల్లోని గుర్రపుడెక్క, చెట్లను తొలగించాల్సి ఉంది. భారీ వర్షాలు వస్తే చల్లకాలువ, పంబలేరుకాలువ నుంచి వచ్చే వరదనీరు పట్టణాన్ని ముంచేస్తుంది. దీంతో జనార్దనరెడ్డి కాలనీ, దూర్జటి నగర్ తదితర లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి అవుతుంటాయి. గూడూరు చెరువు నిండిన సమయంలో దూడల కాలువలో ప్రవాహపు నీరు ముందుకు వెళ్లకపోవడంతో ఆర్టీసీ బస్టాండు, విష్ణువర్ధనపురం, వరదానగర్ గిరిజనకాలనీ తదితర ప్రాంతాలు వరదనీటిలో చిక్కుకుపోతాయి. ఏటా ఇదే తంతు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. ప్రస్తుతం చల్లకాలువ, దూడలకాలువ గుర్రపుడెక్క, కలుపు మొక్కలతో నిండిపోగా, నాయుడు కాలువ నిండా చెట్లు పెరిగిపోయాయి. సంబంధింత అధికారులు చర్యలు తీసుకుని కాలువల్లో పూడిక తీసి, గుర్రపుడెక్క, చెట్లను తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

డీమ్డ్ యూనివర్శిటీగా ఆదిశంకర విద్యాసంస్థలు



మీడియాతో మాట్లాడుతున్న వంకి పెంచలయ్య

గూడూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యను అందించే ఆదిశంకర విద్యాసంస్థలకు డీమ్డ్ యూనివర్శిటీ హోదా లభించిందని ఛైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య తెలిపారు. ఆదివారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ 2001లో 180 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఆదిశంకర కళాశాలలో ఇంజనీరింగ్‌తో పాటు డిప్లొమా, ఫార్మసీ, లా, బీఈడీ కోర్సుల్లో నేడు 8వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్‌లో 975 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు తమ డీమ్డ్ యూనివర్శిటీలో ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నామని చెప్పారు. తమ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించడంతో పాటు బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. తమ విద్యాసంస్థలు డీమ్డ్ యూనివర్శిటీగా మారేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజయ్య, రామయ్య, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో కార్డన్‌సెర్చ్



టిడ్కో గృహాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ నేరాలను అదుపుచేసేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఈ ప్రాంతంలో ఎవరైనా కొత్తవ్యక్తుల సంచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు చేపడుతామని, ప్రజలందరూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు సురేష్‌బాబు, గోపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాన్యూస్ కార్యాలయంపై దాడి హేయం

గూడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మహాన్యూస్ కార్యాలయంపై దాడిని ఖండిస్తూ ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మీడియా ప్రతినిధులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మహాన్యూస్ కార్యాలయంపై దాడులకు పాల్పడిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కఠిన చర్యలు చేపట్టాలని, ఈ తరహా చర్యలు పునరావృతం కాకుండా తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పోలీసు స్టేషన్‌కు రెండు మోటారు సైకిళ్లు



పోలీసుస్టేషన్‌కు చేరిన మోటరు సైకిళ్లు

సూళ్లూరుపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట పోలీసు స్టేషన్లకు రెండేసి మోటరు సైకిళ్లను ప్రభుత్వం కేటాయించింది. అధునాతన సౌకర్యాలున్న ఈ మోటరు సైకిళ్లకు ఒకవైపు ఎరుపు రంగు బల్బుతో సిగ్నల్, మరోవైపు బ్లూ రంగు సిగ్నల్స్ లైట్స్‌తో పాటు సైరన్ అమర్చారు. ట్రాఫిక్‌తో పాటు రాత్రి సమయాల్లో ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు డ్యూటీలో ఉన్న పోలీసు సిబ్బంది ఈ మోటరు సైకిళ్లపై ఘటనా స్థలానికి చేరుకుంటారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది.

గ్యాస్ సిలిండర్ పైపు లీక్

తప్పిన ప్రమాదం

నాయుడుపేట టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పొగగొట్టంకాలనీ సమీపంలో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పైపు లీక్ అవడంతో మంటలు చెలరేగాయి. ఆదివారం గృహిణి ఇంట్లో వంట చేస్తుండగా ఆకస్మాత్తుగా గ్యాస్ సిలిండర్ పైపు లీక్ కావడంతో మంటలు చెలరేగడంతో ఇంట్లో కుటుంబసభ్యులు పరుగులుతీశారు. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చే అంతలోపు స్థానికులే మంటలను అదుపుచేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దారు

కోట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, వెంకన్నపాళెం, కోట, తిమ్మానాయుడుపాళెం, కొక్కుపాడు పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహసీల్దారు జయజయరావు తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించి బీఎల్‌వోలకు సూచనలిచ్చారు. ఆయన వెంట మండల సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు శ్రీనివాసులు, రమణయ్య ఉన్నారు.

రేపటి నుంచి అకడమిక్ కన్సల్టెంట్లకు పర్ఫార్మెన్స్ రివ్యూ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో అకడమిక్ కన్సల్టెంట్లు, అకడమిక్ కో-ఆర్డినేటర్లకు మంగళవారం నుంచి పర్ఫార్మెన్స్ రివ్యూ నిర్వహించనున్నారు. జూలై 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ చేపట్టేందుకు యూనివర్సిటీ అధికార యంత్రాంగం ప్రణాళికను రూపొందించింది. అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ లోని వీసీ ఛాంబర్‌లో ఏర్పాట్లు చేశారు. 1వ తేదీ ఆంత్రోపాలజీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్‌సైన్స్, జియాలజీ, హోమ్‌సైన్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులకు సంబంధించిన వారికి రివ్యూ చేపడతారు. 2న ఫిషరీసైన్స్, జువాలజీ, కామర్స్, కంప్యూటర్‌సైన్స్, ఫార్మసీ సబ్జెక్టులకు నిర్వహిస్తారు. 3న సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్, 4న అడల్ట్ ఎడ్యుకేషన్, ఆర్కియాలజీ, హిస్టరీ, టూరిజం, ఉర్దూ, ఉమెన్ స్టడీస్, పాపులేషన్ స్టడీస్, ఎకనమెట్రిక్స్, ఎకనమిక్స్, ఇంగ్లిషు, హిందీ, హ్యూమన్‌రైట్స్, సోషియాలజీ వారికి రివ్యూ చేపడతారు. 5న లా, లైబ్రరీసైన్స్, ఫిలాసఫీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, పొలిటికల్‌సైన్స్, లింగ్విస్టిక్స్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, సంస్కృతం, హిందీ, తమిళం, ఎడ్యుకేషన్, ఏఐఎస్ఈ వారికి రివ్యూ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి యూనివర్సిటీలోని కాలేజీలకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

త్వరలో జూనియర్స్ సీపీఎల్

తిరుపతి(క్రీడలు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): జూనియర్స్ సీపీఎల్ 1 త్వరలో నిర్వహించనున్నట్లు సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో జూనియర్స్ సీపీఎల్ 1 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే క్రీడా ప్రతిభను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో 12నుంచి 16సంవత్సరాల లోపు క్రీడాకారులతో జూనియర్స్ సీపీఎల్ 1 టీ 20లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టీంలను ఫ్రాంచైజీ ద్వారా దక్కించుకునేందుకు ఆసక్తిగల యజమానులు ముందుకురావాలని, మరిన్ని వివరాలకు 8886185559, 9000214966నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నరసింహాచారి, నరేంద్ర, రవి, గిరిప్రకాష్, శ్రీనివాసమూర్తి, శ్రీధర్, సతీష్‌యాదవ్, హరిప్రసాద్, దివాకర్, రవి, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

తిరుచానూరు, జూన్29(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విశాఖపట్నానికి చెందిన ఉషారాణి, మయూరి నృత్య నికేతన్ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన నాట్యం సభికులను అలరించింది. గజాననయుతంతో మొదలై బ్రహ్మాంజలి.. అదివో అల్లదివో శ్రీహరివాసము, గజవదన బెడువే.. శ్రీమన్ నారాయణ.. గరుడగమన రారా తదితర పాటలకు కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు.

ఇంటింటికీ మంచి ప్రభుత్వంపై దిశా నిర్దేశం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూయిన సందర్భంగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమంపై ప్రజలకు వివరించేలా ఇంటింటికీ మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ చెప్పారు. ఆదివారం ఆంధ్రజ్యోతితో మాట్లాడిన ఆమె మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారన్నారు. వచ్చే నెల 2నుంచి ఇంటింటికీ మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపడుతామన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



చెత్తాచెదారాలను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని బీసీ కాలనీలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపడుతున్నట్లు టీడీపీ నాయకులు అరికట్ల మస్తాన్ నాయుడు, అబ్దుల్‌రహీం అన్నారు. ఆదివారం 33వ వార్డులో చెత్తా చెదారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వార్డులో చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో పాటు కాలువల్లో మురుగు నిల్వ చేరడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పారిశుధ్యాన్ని మెరుగుపరిచేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పరమేశ్వర్, ఇశ్రాయిల్ కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

దేశం గర్వించే గణాంక శాస్త్రవేత్త పీసీ మెహలనోబీస్

పద్మావతి వర్శిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ



పీసీ మెహలనోబీస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దేశం గర్వించేంతటి గణాంక శాస్త్రవేత్త పీసీ మెహలనోబీస్ అని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ పేర్కొన్నారు. ఆ వర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగం - డేటాసైన్స్ సెంటర్ - ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐఎస్‌పీఎస్) సంయుక్తంగా పీసీ మెహలనోబీస్ జయంతి సభను పద్మావతి వర్సిటీలో ఆదివారం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ గణాంకశాస్త్రం సమాజంలో అత్యంత ప్రాముఖ్యత కల్గిందన్నారు. ప్రతి విషయంలో గణాంకాలను జోడించడం అనే అంశం సూటిగా బోధపడుతుందన్నారు. స్టాటిస్టిక్స్ చదువుకున్న వారికి మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కూడా పెంపొందించుకోవాలన్నారు. పీసీ మెహలనోబీస్ దేశాభివృద్ధికి గణాంక శాస్త్రవేత్తగా ఎంతో కృషి చేశారని అన్నారు. గణాంక శాస్త్రవేత్త ఇక్కుర్తి వెంకట్, అన్నామలై వర్సిటీ ప్రొఫెసర్ పార్థసారథి, డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సిద్ధంకండి

తిరుపతి(ఆటోనగర్), జూన్29(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.కవిత కోరారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్పొరేటర్లకు ఊడిగం చేస్తున్న పాలకులకు బుద్ధి వచ్చేలా నిర్వహిస్తున్న ఈ సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొనాలని కోరారు. ఈ శిక్షణా తరగతుల్లో నాయకులు ఆర్.లక్ష్మి, ఎస్.జయచంద్ర, మాధవ్, కేఎస్ఎస్ ప్రసాదరావు మాట్లాడారు. నాయకులు లక్ష్మి, ఉష, జానకి, అను పాల్గొన్నారు.

ఘనంగా పాండురంగస్వామి అగ్నిగుండం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కరకంబట్టులో శనివారం రాత్రి పాండురంగస్వామి అగ్నిగుండం కార్యక్రమం ఘనంగా జరిగింది. స్వామి చిత్రపటాలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిత్రపటాలను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గోపూజ చేశారు. భక్తులకు ఆదివారం మధ్యాహ్నం అన్నదానం చేశారు.

తారకరామనగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్



ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రేణిగుంట, జూన్ 29, (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట, గాజులమండ్యం, ఏర్పేడు, సబ్ డివిజన్ పోలీసులు ఆదివారం ఉదయం అర్బన్ సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో తారకరామానగర్‌ని జల్లెడ పట్టారు. ఈ ప్రాంతంలో గంజాయి బ్యాచ్ ఆగడాలపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించడంతో పోలీసులు స్పందించి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని 18 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. వీటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాలుపడితే ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ సుధాకర్ రేణిగుంట, గాజులమండ్యం, ఏర్పేడు పోలీసులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న పాఠశాల భవనం



పెచ్చులూడిన శ్లాబ్

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాంపాళెం గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాల భవనం ఆందోళన కలిగిస్తోంది. ఈ పాఠశాలలో 1, 2 తరగతుల్లో ఆరుగురు విద్యార్థులు చదువుకుంటున్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులను వేరే పాఠశాలలో విలీనం చేశారు. ఈ పాఠశాల భవనం నిర్మించి 12 సంవత్సరాలవుతోంది. అప్పట్లో నాసిరకంగా నిర్మించడంతో స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. మరమ్మతులు చేపట్టాలని అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ



శ్రీకాళహస్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ వద్దు అమూల్యమైన జీవితం ముద్దు అనే నినాదంతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు టీడీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జయరాంరావు వీధి కూడలిలో ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలు గంజాయిని ప్రధాన ఆదాయ వనరుగా ,అరాచకవాదులు ఆయుధంగా ఉపయోగించుకున్నారన్నారు. గంజాయి మహమ్మారిని సమూలంగా నాశనం చేయడానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దశరథాచారి, మిన్నల్ రవి, మునిరాజా యాదవ్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, బీమాల భాస్కర్, పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ఒంటికాలిపై కార్మికుల నిరసన



పుత్తూరు అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ, గ్రామ రెవెన్యూ సహాయకులు, ఆశా వర్కర్లు తదితర విభాగాల వారి సర్వీస్ రూల్స్ తమకు కూడా అమలు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది డిమాండ్ చేశారు. ఆదివారం వారు మున్సిపల్ కార్యాలయం వద్ద ఒంటికాలిపై నిలబడి నిరసన తెలియజేశారు. ఫుల్ టైమ్ పనిచేసే తమకు సర్వీస్ రూల్స్ వర్తింప చేయాలన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మీడియాపై దాడికి నిరసన

పుత్తూరు అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మహాన్యూస్ మీడియా కార్యాలయంపై బీఆర్ఎస్ దాడిని పుత్తూరు జర్నలిస్టులు ఖండించారు. దాడికి వ్యతిరేకంగా ఆదివారం అంబేద్కర్ కూడలి వద్ద వారు ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలియజేశారు. అనంతరం ఏఎస్ఐ పొన్నుస్వామికి ఫిర్యాదు చేశారు.

క్రికెట్ టోర్నీ విజేత రెడ్ ఈగల్స్



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న నాయకులు.

వడమాలపేట,జూన్ 29(ఆంధ్రజ్యోతి):పట్టణంలో 15రోజులుగా జరుగుతున్న టీ-టెన్ క్రికెట్ టోర్నమెంట్‌లో తిరుపతి మిట్లూరుకు చెందిన రెడ్ ఈగల్స్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో 13పరుగుల తేడాతో ఈ జట్టు గెలుపొందింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో టోర్నీ విజేత జట్టుకు రూ.33,333, షీల్డ్‌లను వడమాలపేట గ్రామ టీడీపీ కమిటి అధ్యక్షుడు డిల్లీ ప్రసాద్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిని పాడిపేట ఆర్సీ యూత్ జట్టుకు రూ. 22,222, ట్రోఫీ అందజేశారు._ వడమాలపేట రైజింగ్ స్టార్ జట్టుకు మూడవ బహుమతిగా రూ.7,777, రాము లెవెన్స్ జట్టుకు 4వ బహుమతి కింద రూ.5,555 అందజేశారు. ఈ టోర్నిలో 38 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు చిత్తూరు పార్లమెంట్ టీడీడీ అధికార ప్రతినిధి ధనంజయుల నాయుడు, మండలం టిటిడి అధ్యక్షులు దాముయాదవ్, కార్యదర్శి శివ, నాయకులు మణి రాజు, సురేష్ రాజు,ముని, రాధాకృష్ణలు పాల్గొని బహుమతులను అందజేశారు. వడమాలపేట యూత్ అసోసియేషన్ క్రీడాకారులు భాస్కరెడ్డి, పవన్, పండు, సునీల్, శివయ్యల ఆధ్వర్యంలో టోర్నీ జరిగింది.

31న పిడికిలి గంగ జాతర

పుత్తూరు అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక బజారువీధిలో పిడికిలి గంగమ్మ జాతర నిర్వహణకు కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. జాతర తేదీని కమిటీ నిర్ణయించింది. ఆగస్టు 31న జాతర చాటింపు, సెప్టెంబర్ 2న చాటుబండి ఊరేగింపు, 3న గంగ జాతర ప్రధాన వేడుక చేపట్టనున్నట్లు వెల్లడించారు. విజయవంతంగా జాతర నిర్వహణ ఏర్పాట్లపై విభాగాల వారీగా బాధ్యతలు అప్పగించారు.

ముక్కంటి అన్నదానానికి విరాళం



శ్రీకాళహస్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానం పథకానికి ఇద్దరు భక్తులు రూ.51వేల వంతున విరాళం అందజేశారు. వరంగల్‌కు చెందిన గుండా లలిత్ కేశవ్ దంపతులు, గుండా రామ్ శివ కేశవ్ దంపతులు ఈ విరాళాలను ఆదివారం ఆలయంలో ఏఈఓ మోహన్‌ను కలిసి అందజేశారు. ఆలయ అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ: ఇద్దరికి గాయాలు

కేవీబీపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) ఓళ్ళూరులో పొలం విషయంలో ఇరువర్గాలు వివాదానికి దిగారు. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చంద్రకళ, మంజుల, వెంకటేశులు బంధువులు, వీరికి వారసత్వంగా చంద్రకళరే తల్లి నుంచి 25సెంట్ల భూమి, వెంకటేశులకు తండ్రి నుంచి 25సెంట్లు వచ్చింది. ఈ రెండూ పక్కపక్కనే ఉన్నాయి. వెంకటేశులు కుటుంబం కొంతకాలంగా ఆడపిల్లకి వచ్చిన పొలం తమదేనంటూ గొడమ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఇరువర్గాలూ గొడవ పడ్డారు. ఇద్దరు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రేణిగుంట, జూన్ 29, (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఇది. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు తిరుపతి, రేణిగుంట మార్గంలోని పారిశ్రామిక వాడలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి షీబార్ కర్మాగారం సమీపంలోని రోడ్డు పక్కన పడుకుని మృతి చెందాడు. అతిగా మద్యం తాగి మృతి చెందినట్లు భావిస్తున్నారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

జనసేన సభ్యత్వ కిట్ల అందజేత



జనసేన సభ్యత్వం అందజేస్తున్న చంద్రశేఖర్

శ్రీకాళహస్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జనసేన క్రియాశీలక సభ్యత్వాలు పొందిన వారికి పార్టీ తరఫున కిట్లు పంపిణీ చేశారు. పార్టీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆదివారం పట్టణంలోని భాస్కర్ పేట, తెట్టు, బీపీ అగ్రహారం, శ్రీకాళహస్తి మండలంలోని కమ్మకొత్తూరు గ్రామాల్లో ఈ కిట్లు అందజేశారు. పార్టీ ద్వారా లభించే భరోసాను వివరించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, నాయకులు లక్ష్మణ్, నవీన్, రాజా తదితరులు పాల్గొన్నారు.

నంది వాహనంపై పరాశరేశ్వరుడు



నారాయణవనం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నంది వాహనంపై ఊరేగించారు. నిత్యకైంకర్యాలనంతరం వేద మంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివారితో సహా అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వారిని నంది వాహనంపై ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలతో దర్శించుకున్నారు.

అతిగా మద్యం తాగి మృతి



రహ్మతుల్లా (ఫైల్ ఫొటో)

వరదయ్యపాళెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ మల్లికార్జున వివరాల మేరకు గ్రామానికి చెందిన రహ్మతుల్లా (49) మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానాలని ఎంత చెప్పినా వినకపోవడంతో పది రోజుల క్రితం అతని భార్య నెల్లూరులోని సోదరి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో రహ్మతుల్లా అతిగా తాగి మూడు రోజుల క్రితం తన ఇంటిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఇంటిలోంచి దుర్వాసన రావడంతో పక్కింటి వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి రహ్మతుల్లా మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని సూళ్ళూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రధాని ప్రశంసలు సంతోషకరం



మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఆనంద్ సహా పార్టీ నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): : విశాఖపట్నంలో ఇటీవల జరిగిన యోగాంధ్ర కార్యక్రమంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల జల్లు కురిపించడం సంతోషకరమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. ప్రధానమంత్రి ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ లైవ్ ప్రసారాన్ని శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయంలో బీజేపీ నేతలు వీక్షించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ మోదీ విశాఖలో మూడు లక్షల మందితో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించినందుకు ప్రశంసించారన్నారు. బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, కృష్ణయ్య, భరత్ నాయుడుపాల్గొన్నారు.

ప్రమాదకరంగా కార్గిల్ సెంటర్



కార్గిల్ సెంటర్



జంక్షన్‌లో పోలీస్ ఐలాండ్, బారికేడ్లు

శ్రీకాళహస్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కార్గిల్ సెంటర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. పట్టణ నడిబొడ్డున కొత్తపేటలో ఈ ప్రాంతముంది. మూడు ప్రధాన రహదారులు వై అక్షరం ఆకారంలో ఉండే కూడలి ఇది. వినాయక స్వామి ఆలయం కూడా ఉండడంతో నిత్యం పెద్ద ఎత్తున భక్తులుదర్శనానికి విచ్చేస్తుంటారు. పాత బస్టాండ్ వైపు నుంచి పీవీ రోడ్డుకు వెళ్లాలన్నా... అగ్నిమాపక కేంద్రం రోడ్డు నుంచి పాత బస్టాండు, కొత్తపేట, మంగళ వీధికి వెళ్లాల్సిన వారు ఈ కూడలిలో యూటర్న్‌గా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. సరిగ్గా కూడలిలో వినాయక ఆలయం ఎదుట ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. అప్పుడప్పుడు పెద్ద ఎత్తున ప్రైవేటు ఫ్లెక్సీలు రోడ్డుపై అడ్డదిడ్డంగా పెట్టేస్తున్నారు. దీంతో రెండు వైపులా యూటర్న్‌గా వెళ్లాల్సిన వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొద్ది నెలలుగా పోలీస్ శాఖకు చెందిన ఐలాండ్, భారీ కేడ్లను కూడలిలో వినాయక స్వామి ఆలయం ఎదుట రోడ్డుపై వదిలేశారు. దాంతో ఆ పరికరాలకు అనుకుని కొందరు నిర్లక్ష్యంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. వివాహనాల పక్కనే వీధి వ్యాపారులు విక్రయాలు సాగిస్తున్నారు. రోడ్డు మీద అడ్డంకులు ఏర్పడుతున్నాయి. మలుపు తిరిగే సమయంలో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కార్గిల్ సెంటర్కు పక్కనే జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఒక ప్రైవేటు కళాశాల, ఆరు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. విద్యాసంస్థల పనివేళల్లో కార్గిల్ సెంటర్లో రాకపోకలకు పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల నెల రోజుల వ్యవధిలో ఐదుగురు ద్విచక్ర వాహనదారులు, ఇద్దరు బాటసారులు గాయపడినట్లు స్థానికులు వాపోతున్నారు. స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆకట్టుకున్న హిడింబాసుర, బకాసుర వధ



స్వామి, అమ్మవార్ల నగరోత్సవం



భిక్షాటనకు బయలుదేరిన భీముడి వేషధారులు



బకాసురుడి వధ ఘట్టం

శ్రీకాళహస్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన హిడింబాసుర, బకాసుర వధ ఆకట్టుకున్నాయి. అంతకు మునుపు భీమసేనుడు పురవీధుల్లో భిక్షాటన చేశారు. ద్రౌపది, అర్జునుడు, శ్రీకృష్ణుడి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. సాయంత్రం భీమసేన ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ చప్పరంపై అధిష్ఠించారు.అనంతరం స్వామిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ తీగల మార్పు

● రెండు దశాబ్దాల తర్వాత తీరిన సమస్య



విద్యుత్ లైన్‌ను మార్పు చేయిస్తున్న టీడీపీ నాయకులు గాలి మురళి నాయుడు

శ్రీకాళహస్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఏడు ఇళ్లపై మృత్యుపాశాలుగా 20 ఏళ్ల పాటు వెంటాడిన విద్యుత్ తీగల సమస్య ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చెరువుతో పరిష్కారమైంది. తొట్టంబేడు మండలం కొణతనేరి పంచాయతీలోని గుర్రప్ప నాయుడు కండ్రిగలో ఎన్టీఆర్ తొలిసారి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ఇక్కడ స్థానిక ప్రజలకు పలువురికి పక్కా ఇళ్లు మంజూరు చేశారు. రెండు దశాబ్దాల క్రితం ఇక్కడున్న ఏడుగురి ఇళ్లపై విద్యుత్ తీగల లైను ఏర్పడింది. అప్పటి నుంచి వారు బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. రెండుసార్లు కల్లుగీత కార్మికుల గడ్డివాములు కూడా దగ్ధమయ్యాయి. గత వైసీపీ పాలకులకు విన్నవించినప్పటికీ పట్టించుకోలేదు. బాధితులు టీడీపీ సీనియర్ నాయకులు గాలి మురళి నాయుడు ద్వారా ఇటీవల ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ ఏఈ బాలాజీ ఆదివారం సిబ్బందితో కలిసి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్‌ను మార్చారు. ఏడు కుటుంబాల వారు ఊపిరి పీల్చుకున్నారు.

చట్టాలపై అవగాహన ప్రయోజనకరం



మొక్క నాటుతున్న న్యాయమూర్తి భారతి

శ్రీకాళహస్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరికీ ఎంతో ప్రయోజనకరమని ఉమ్మడి చిత్తూరు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎమ్మెస్ భారతి అన్నారు. ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు... ఆదివారం న్యాయమూర్తి శ్రీకాళహస్తి ఉపకారాగారాన్ని సందర్శించారు. వసతుల కల్పన, వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు,పరిసరాలను పరిశీలించారు. తర్వాత జైలు ఆవరణలో మొక్క నాటారు. చట్టాలపై అవగాహన కల్పించారు. జూలై 5న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను అవసరమైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంటు శ్రీకాంత్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ప్యారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటికీ తెలుగుదేశం' విజయవంతం చేద్దాం



సమావేశానికి హాజరైన సుధీర్,నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికి తెలుగుదేశం నినాదంతో పార్టీ శ్రేణులంతా గడపగడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ విజయవంతం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చినట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. విజయవాడలో ఆదివారం జరిగిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశనికి ఆయన హాజరయ్యారు. సుపరిపాలనలో తొలి అడుగు కింద నెలరోజులపాట పార్టీ శ్రేణులతో కలిసి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సీఎం దిశానిర్దేశం చేశారని ఆయన ఫోన్‌లో తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

శ్రీకాళహస్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో పాడుబడిన భవనంలో కొందరు పేకాట ఆడుతున్నట్టు రెండో పట్టణ పోలీసులు సమాచారం అందుకున్నారు. ఆదివారం సాయంత్రం దాడి చేశారు. నాలుగు ద్విచక్ర వాహనాలతో సహా, నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఈ రహదారిలో ప్రయాణమంటే హడలే!



యానాదివెట్టువద్ద ప్రధాన రహదారి దుస్థితి

వరదయ్యపాళెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రం నుంచి సత్యవేడు, శ్రీసిటీ, చెన్నైకి చేరుకునే అనుసంధాన రహదారులు ఛిద్రమాయ్యయి. కడూరు క్రాస్, వెంటకరెడ్డి కండ్రిగ, సుబ్బానాయుడుకండ్రి, కంచరపాళెం, యానాదివెట్టు, రాచర్ల, చిన్నపాండూరు గ్రామాల నుంచి శ్రీసిటీకి, హీరో, అపోలో తదితర పరిశ్రమలకు చేరుకోలేక పోతున్నారు. రహదారుల విషయంలో ఆర్అండ్‌బీ పర్యవేక్షణ లోపం కనపడుతోంది. గత ప్రభుత్వంలో రహదారులను పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితికి చేరుకున్నాయి. కనీసం ఇప్పుడైనా మరమ్మతులు చేపట్టాని మండలవాసులు కోరుతున్నారు.

పద్మావతి అమ్మవారికి వెండి తుంగా వళికలు

తిరుచానూరు, జూన్29(ఆంధ్రజ్యోతి) : తిరుచానూరులో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి రూ.3.30 లక్షల విలువైన వెండి తుంగా వళికల(వేలాడే దీపస్తంభాలు)ను హైదరాబాద్‌కు చెందిన వీరాంజనేయులు ఆదివారం అందజేశారు. 3కేజీల బరువు ఉన్న వెండి తుంగావళికలను దాత కుటుంబ సభ్యులతో కలసి అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతికి అందజేశారు.